క్లుప్తంగా

ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు



శింగరాయిలో బుద్ధుని విగ్రహం వద్ద మహిళా సంఘ సభ్యులు

వేపాడ: మండలంలోని శింగరాయి గ్రామంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రమా భాయి మహిళా సంఘం, అంబేడ్కర్ యువ జన సేవా సంఘం ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త అప్పారావు మాట్లాడుతూ.. శాంతిని వెతికే ప్రతి మనిషీ బుద్ధుని మార్గంలో పయనించాలన్నారు. ఆయన బోధనలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిక్కి సన్యాసమ్మ, జామి దేముడు, గొల్ల అవతారం, రిక్కి కృష్ణమ్మ, నాగమ్మ భాను దేముడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మా పొట్ట కొట్టొద్దు..



ఇన్‌చార్జ్ ఆర్డీఓ ప్రమీలా గాంధీకి వినతపత్రం అందజేస్తున్న రైతుసంఘ ఉపాధ్యక్షుడు జగన్, గిరిజనులు

వేపాడ: దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న మా భూములను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించి మా పొట్ట కొట్టవద్దని మారిక గ్రామానికి చెందిన గిరిజనులు వాపోయారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ ఆర్డీఓ ప్రమీలా గాంధీని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రైతు కూలీ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో మారిక గ్రామానికి చెందిన గిరిజనులు విజయనగరంలో ఆర్డీఓను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. తరల తరబడి నమ్ముకున్న భూములను వదులుకోలేమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు గిరిజన యువకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం: నిరుద్యోగ యువతీ, యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ పని చేస్తున్నారని కొనియాడారు. ఉత్తరాంధ్రలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మక్కువ శ్రీధర్, శీరంరెడ్డి రామ కుమార్, ప్రదీప్ కుమార్, లెంక బంగారునాయుడు, రుంకాన అరుణ, లెంక చిన్నం నాయుడు, ఆంధ్ర రిజర్వాయర్ ఛైర్మన్ కోడి సతీష్, తదిరులు పాల్గొన్నారు.

ఎస్సీ రుణాలకు 96 దరఖాస్తులు

దత్తిరాజేరు: ఎస్సీ రుణాల మంజూరుకు సంబంధించి ఇంతవరకు 96 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇంటర్వ్యూ కోసం సమాచారం పంపించామన్నారు. బ్యాంక్ సిబ్బంది సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించి, అర్హులకు రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధం..



ట్రాక్టర్‌తో దుక్కు చేపడుతున్న దృశ్యం

- దుక్కులతో బిజీగా ఉన్న రైతన్నలు
- విత్తనాలు సిద్ధం చేసే పనిలో అధికారులు

సాగు విస్తీర్ణం...

మండలం పేరు	వరి	అపరాలు
గజపతినగరం	2427 హెక్టార్లు	30 హెక్టార్లు
మెంటాడ	2631	11
దత్తిరాజేరు	2373	5
బొండపల్లి	2284	6.50
గంట్యాడ	2900	3 హెక్టార్లు

బొండపల్లి: గజపతినగరం వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. అన్నదాతలకు అవసరమయ్యే విత్తనాలను సిద్ధం చేసే పనిలో వ్యవసాయాధికారులున్నారు. ఇదిలో ఉంటే వర్షాలు అనుకున్నంతగా పడకపోవడంతో రైతుల్లో కాస్త ఆందోళన నెలకొంది. ప్రసుత్తం అరకొరగా కురుస్తున్న వర్షాలకు రైతులు దుక్కులు చేపట్టే పనిలో ఉన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత ఏప్రిల్ నెలాఖరు నుంచి మే నెల రెండో వారం వరకు సరైన వర్షాలు కురవలేదు.

మూడు వారాలు గడుస్తున్నా..

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు వారాలు గడుస్తున్నా నేటికీ సరైన వర్షాలు పడకపోవడంతో.. ప్రస్తుతం సాగులో ఉన్న నువ్వు పంటపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రధాన పంట అయిన వరి సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన దుక్కులు చేపడుతున్నారు.

నివేదికలు పంపించాం..



ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపించాం. ఎంత విస్తీర్ణంలో ఏయే పంటలు పండిస్తారో నివేదికలు జిల్లా అధికారులకు అందజేశాం. రైతులకు రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తాం.

– కె.మహరాజన్, వ్యవసాయ శాఖ ఏడీఏ, గజపతినగరం సబ్ డివిజన్

విత్తనాలకు ప్రతిపాదనలు..

రైతులకు రాయితీపై వివిధ రకాల విత్తనాలు అందించేందుకు వ్యవసాయాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రైతుసేవా కేంద్రాల వారీగా రైతుల వివరాలు, సాగు విస్తీర్ణం, పంటల వివరాలు తెలుసుకుని ఎన్ని విత్తనాలు కావాలో ప్రభుత్వానికి నివేదికలు పంపించారు. కొద్ది రోజుల్లోనే రైతులకు విత్తనాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

కమీషన్ ఇస్తేనే రుణం

- ఖాతాదారులను వేధిస్తున్న డీసీసీబీ సిబ్బంది



గ్రామంలో మీసాల సత్యవతి ఇంటిని పరిశీలిస్తున్న డీసీసీబీ సిబ్బంది

గుర్ల: గ్రామాల్లో అప్పులకు అధిక వడ్డీ చెల్లించలేక తక్కువ వడ్డీతో అధిక రుణం ఇస్తున్న బ్యాంకులను సంప్రదిస్తున్న రైతులు, ప్రజలను గుర్ల డీసీసీబీ సిబ్బంది వేధిస్తున్నారు. ఈ మేరకు మండలంలోని గరిడ గ్రామానికి చెందిన మీసాల సత్యవతి తన గృహంపై లోన్ ఇవ్వాలని డీసీసీబీని సంప్రదించింది. సత్యవతి దగ్గర డీసీసీబీ అధికారులు పూర్తి స్థాయి పత్రాలు తీసుకుని, ఇంటిని పరిశీలించి రూ.5లక్షలు రుణం ఇస్తానని హామీ ఇచ్చారు. బ్యాంకుకు అవసరమైన డాక్యుమెంటేషన్ పత్రాల కోసం ఆమె రూ. 20వేలు ఖర్చు చేసి బ్యాంకు అధికారులను సంప్రదించగా లక్షకు రూ.2వేలు చొప్పున మొత్తం రూ.10 వేలు కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత నగదు ఇవ్వలేనని ఆమె అధికారులకు తెలపగా మీ ఇంటిపై రూ. 3లక్షలు మాత్రమే రుణం అందిస్తామని చెప్పారు. బ్యాంకు సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని తెలిసి తన పత్రాలు ఇచ్చేసి రుణం ఇవ్వడం కుదరదని చెప్పారని మీసాల సత్యవతి సోమవారం వాపోయింది. లోన్ కోసం వచ్చే రైతులను కూడా కమీషన్ల కోసం వేధిస్తున్నారని ఇదే విషయంపై బ్యాంకు సిబ్బందికి ప్రజాప్రతినిధులు హెచ్చరించినప్పటికీ ఫలితం లేకుండా ఉందని పలువురు వాపోతున్నారు. ఇదే విషయంపై గుర్ల డీసీసీబీ మేనేజర్ హరి కేశవ్‌ను సంప్రదించగా లోన్‌పై ఎటువంటి కమీషన్లు తీసుకోవడం లేదని, కమీషన్లు అడిగిన వారిపై ఏసీబీకి ఫిర్యాదు చేయాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి..



గ్రామస్తులకు వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తవలస: ఎండల నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఎల్.సత్యారావు అన్నారు. మండలంలోని ముసిరాంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీ హైడ్రేషన్‌కు లోనవకుండా ఉండేందుకు మజ్జిక, నిమ్మరసం, బార్లీ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఎండలో పని చేసే సమయంలో కాళ్లకి చెప్పులు, తలకు టోపీ గాని తలపాగా గాని ధరించాలన్నారు. బీపీ, సుగర్ ఉన్నవాళ్లు తప్పనిసరిగా మందులు వాడాలన్నారు. వీలైనంతరవరకు ఆయిల్ ఫుడ్స్, బిర్యానీ, మాంసం వంటి పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పద్మావతి, ఈశ్వరరావు, తులసి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సీట్లపై ప్రచారం..



నోటీస్‌బోర్డులో కరపత్రాలు ఏర్పాటు చేస్తున్న ఎంఈఓ - 2 ధర్మశ్రీను, సిబ్బంది



సాక్షిలో ప్రచురితమైన కథనం

మెరకముడిదాం: ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లపై స్థానిక విద్యాశాఖాధికారులు కనీస ప్రచారం చేపట్టకపోవడంతో సోమవారం సాక్షి దినపత్రికలో 'ఉచిత సీట్లపై ప్రచార లోపం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో విద్యాశాఖాధికారులు స్పందిస్తూ.. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఎంఈఓ - 2 ధర్మశ్రీను ఆధ్వర్యంలో సిబ్బంది ప్రచారానికి సంబంధించిన కరపత్రాలను నోటీస్‌బోర్డులు అతికించారు. అలాగే త్వరలోనే సచివాలయాల్లో కరపత్రాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీ శంకరారవు, రాజి నాయుడు, పైడిరాజు, ఉగాది పాల్గొన్నారు.

కలుషిత నీటితో ఇక్కట్లు..



ధర్మవరంలో నిరసన తెలియజేస్తున్న మహిళలు

శృంగవరపుకోట: దుర్వాసనతో ఉన్న తాగునీటిని అందిస్తూ మా ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్నారని ధర్మవరం గ్రామంలోని యాతవీధి, పెంటవీధికి చెందిన మహిళలు ఆరోపించారు. ఈ మేరకు సర్పంచ్ ఇంటి వద్ద సోమవారం నిరసన చేపట్టారు. న్యాయవాది మండా కామేశ్వరరావు నేతృత్వంలో వారంతా ఒక్కటై అధికారులను ప్రశ్నించేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు వెళ్లారు. కార్యాలయానికి తాళాలు వేసి ఉండడంతో సర్పంచ్ ఇంటి వద్దకు చేరి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. తమ వీధుల్లో మురుగు కాలువల్లో పైపులైన్లు ఉన్నాయని వాపోయారు. ఎన్ని దఫాలు ఫిర్యాదులు చేసినా, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని న్యాయవాది కామేశ్వరరావు అన్నారు. పాలకులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించని ఎడల న్యాయపోరాటం చేయక తప్పదన్నారు.

పట్టాలిచ్చారు సరే.. స్థలాల మాటేమిటి...?

- సీపీఐ ఆధ్వర్యంలో బాధితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న పట్టాదారులు

కొత్తవలస: పట్టాలిచ్చి సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు స్థలాలు చూపించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బాధితులు సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. కొత్తవలస గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వేనంబర్లు 168,173లలో సుమారు 300 మందికి ఒక్కొక్కరికీ మూడు సెంట్లు చొప్పున స్థలం ఇస్తామని చెబుతూ 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసింది. అయితే ఇంతవరకు పట్టాదారులకు అధికారులు ఇళ్ల స్థలాలు చూపించలేదు. దీంతో సీపీఐ నియోజకవర్గ నాయకుడు దేగల అప్పలరాజు ఆధ్వర్యంలో బాధితులు సంబంధిత సర్వే నంబర్లలో గల స్థలం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం అప్పలరాజు, పట్టాదారులు మాట్లాడుతూ.. లబ్ధిదారులు అద్దె ఇళ్లల్లో ఉంటూ చాలా ఇబ్బంది పడుతున్నారని, అధికారులు వెంటనే స్పందించి స్థలాలు కేటాయించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు పట్టాదారులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి వితరణ..



కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి పట్టణంలోని డైలీ మార్కెట్‌కు చెందిన కిల్లంశెట్టి సన్యాసిరావు, శోభ దంపతులు రూ.50,116 ఆర్థిక సహకారం అందజేశారు. ఈ మేరకు సోమవారం తమ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాత తల్లిదండ్రులు కిల్లంశెట్టి వెంకట రామాంజనేయులు, లక్ష్మీకుమారి జ్ఞాపకార్థం ఆలయ ట్రస్ట్ సభ్యులకు సన్యాసిరావు నగదు అందించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణుమూర్తి, ఎస్‌వీజీ శ్రీనివాసరావు, గుడ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల వ్యాయామం..



రన్నింగ్ చేస్తున్న పిల్లలు



లాంగ్‌జంప్ చేస్తూ..



వ్యాయామం చేస్తూ..



టైర్ ఎత్తుతున్న చిన్నారి..



పులప్స్ తీస్తూ..

ఆరోగ్యంగా ఉండాలంటే వ్యాయామం చేయాల్సిందే. అది చిన్న పిల్లలైనా, పెద్ద వారైనా సరే తప్పనిసరి . ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో చిన్నారులు ఎక్కువగా సెల్‌ఫోన్లకు అతుక్కుపోతుంటారు. ఇటువంటి సమయంలో వారంతా ఆటపాటలతో కూడిన ఎక్సర్‌సైజ్‌లు చేసేలా తల్లిదండ్రులు దృష్టి సారించాలి. ఇటువంటి సమయంలో పట్టణానికి చెందిన ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరానికి వంద మంది వరకు పిల్లలు ప్రతిరోజూ ఉదయాన్నే వచ్చి ఆయన దగ్గర శిక్షణ పొందుతున్నారు. రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, తదితర వ్యాయామాలు చేస్తూ చిన్నారులు మైదానంలో సందడి చేస్తున్నారు.

– చీపురుపల్లి

ఆటపాటలతో..



యువతీ,యువకులు.. వృద్ధులు.. ఇలా అన్ని వర్గాల వారూ ఆటపాటలతో ఆరోగ్య సమస్యలకు చెక్ పెడుతున్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రతి ఒక్కరూ తెల్లవారుజామునే ఎక్సర్‌సైజులు చేస్తున్నారు. ఇందులో చాలా మంది వాకింగ్, జాగింగ్, రన్నింగ్‌లతో పాటు షటిల్, బ్యాడ్మింటన్ వంటి ఆటలాడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వాకర్స్, క్రీడాకారులతో ప్రతిరోజూ సందడి వాతావరణం నెలకొంటోంది. – గజపతినగరం

వృథాగా తాగునీరు..



గజపతినగరం మండల కేంద్రంలోని పురిటిపెంట బాలాజీనగర్ కాలనీలో తాగునీరు వృథాగా పోతోంది. మంచినీటి కుళాయిలకు ట్యాప్‌లు సరిగ్గా లేకపోవడంతో రెండు నెలలుగా తాగునీరు వృథా అవుతోంది. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసినా, స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుళాయిలకు సరైన ట్యాప్‌లు బిగించాలని ప్రజలు కోరుతున్నారు.

– గజపతినగరం

యోగాపై అవగాహన..



లక్కవరపుకోట మండల కేంద్రంలో సుపథ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి జ్ఞాన, విజ్ఞాన శిక్షణ తరగతులు ఉల్లాసంగా కొనసాగుతున్నాయి. నిర్వాహకుడు ఎ.శ్రీహరిశర్మ రోజుకో అంశంపై విద్యార్థులకు బోధిస్తున్నారు. వివిధ రకాల యోగాసనాలపై సోమవారం అవగాహన కల్పించారు. – లక్కవరపుకోట

నిజరూప దర్శనం..



శృంగవరపుకోట పట్టణ ప్రజల కొంగు బంగారం, గ్రామదేవత దారగంగమ్మ చిన్న పండుగ సోమవారం వైభవంగా ప్రారంభమైంది. మహిళా భక్తులు ఘటాలతో నీళ్లు తెచ్చి మూలమూర్తిని అభిషేకించారు. అర్చకుడు రాజగోపాలచార్యులు ప్రత్యేక పూజలు చేపట్టగా.. భక్తులు అమ్మవారి నిజరూప దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

– శృంగవరపుకోట

సర్టిఫికెట్లు ప్రదానం..



ఎస్.కోట పట్టణంలోని టీచర్స్ కాలనీలో కౌముది ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన 60 మంది మహిళలకు ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్లను సోమవారం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ సెక్టార్ సమర్థ పథకంలో భాగంగా ఉచిత కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు శిక్షణ కేంద్రం నిర్వాహకులు దొడ్డి సూర్యారావు, హేమలత తెలిపారు. – శృంగవరపుకోట

విజయం కోసం..



ఎస్.కోట పట్టణంలోని మోక్షవిద్య యోగా మందిర్ ఆధ్వర్యంలో స్థానిక ఆంధ్రాబ్యాంక్ మేడపై ఉన్న కోచింగ్ సెంటర్‌లో ఎంసెట్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్వామి వివేకానంద ఉత్తేజిత బోధనలను కూడిన 'విజయానికి మార్గం' పుస్తకాలను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు రామకృష్ణ, మోక్షవిద్య యోగా మందిర్ వ్యవస్థాపకుడు శీలా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. రామకృష్ణ మిషన్ రూపొందించిన ఈ పుస్తకం చదవడం వల్ల ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, తద్వారా ఎన్నో సమస్యలను పరిష్కరించుకునే శక్తి వస్తుందని చెప్పారు. – శృంగవరపుకోట

దత్తిరాజేరులో భారీ వర్షం



లక్కవరపుకోట: గంగుబూడి జంక్షన్ సమీపంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



గంట్యాడ: వసాది వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

దత్తిరాజేరు: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గాలులకు మామిడి కాయలు రాలిపోయాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే కొద్ది రోజులుగా ఉక్కబోతతో అవస్థలు పడుతున్న ప్రజానీకం మాత్రం వాతావరణం చల్లబడడంతో సేదదీరారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు..

లక్కవరపుకోట: మండలంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన ఈదురుగాలుల వర్షానికి గంగుబూడి, మల్లివీడు, గోల్డ్‌స్టార్ జంక్షన్, కొత్తపాలెం, తదితర గ్రామాల్లో పదికి పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వర్షం అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ గాలి పెద్ద ఎత్తున వీయడంతో మామిడి కాయలు నేల రాలిపోయాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో విద్యుత్ శాఖాధికారులు రంగంలోకి దిగి విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

రోడ్డుకడ్డంగా పడిన చెట్టు..

గంట్యాడ: మండలంలోని వసాదిలో ఈదురుగాలులకు రోడ్డుకడ్డంగా చెట్టు పడిపోయింది. దీంతో గ్రామానికి గంటల తరబడి రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక యువత చెట్టు తొలగింపు పనులు చేపట్టారు.